సాధ్యమైనంత త్వరగా సాగునీరివ్వండి

కాలువ గండి పూడ్చివేత పనుల పరిశీలనలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కాలువ గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, సెప్టెంబర్ 20: సాధ్యమైనంత త్వరగా రైతులకు సాగునీరు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గండి పూడ్చివేత ఎంత వేగంగా జరుగుతుందో రైతుల పంటలకు అంతేవేగంగా నీటిని వదలాలని, రైతులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూసుమంచి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. సాగర్ ఎడమ కాలువ గండి పూడ్చివేత పనులను పరిశీలించారు. ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గండి కారణంగా సాగునీరు అందక దిగువ రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీటి కోసం వారు రోజూ ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు. తరువాత సీఈ విద్యాసాగర్ స్పందిస్తూ.. గండి పూడ్చివేత పనులు 95 శాతం వరకు పూర్తయ్యాయని, శుక్రవారం అర్ధరాత్రిగానీ లేదా శనివారం గానీ నీటిని అందించేందుకు అన్ని విధాలా కృషిచేస్తున్నామని వివరించారు.

చివరి భూముల్లో ఎండుతున్న పంటలు..

గండి కారణంగా చివరి భూములకు సాగర్ నీరు రాకపోవడం, దానికితోడు గడిచిన నాలుగు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టులోని పంటలు ఎండిపోతున్నాయి. గండి కారణంగా నీటిని విడుదల చేయకపోవడంతో బోనకల్లు, మధిర, నందిగామ బ్రాంచ్ కాలువలు, 16, 17 మెయిన్ బ్రాంచ్ కాలువల కింది రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20 : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించి వాటిని విజయవంతం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ రైతులకు రుణాలను రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద యూనిట్ల గ్రౌండింగ్ విజయవంతంగా చేశామని, ప్రస్తుతం గ్రౌండ్ చేసిన యూనిట్లకు అవసరమైన సహాయ సహకారాలు, సలహాలు, ఆర్థిక అక్షరాస్యత అందించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ రుణమాఫీకి సంబంధించి సాంకేతిక సమస్యలు ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలు బ్యాంకు మేనేజర్లు అప్‌డేట్ చేయాలన్నారు. ముద్ర రుణాలకు కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని రుణ పరిమితి పెంచాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీఐ ఆర్‌ఎం లింగస్వామి, యూబీఐ ఏజీఎం సుధాకర్, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఆర్ ట్రస్టు బాధ్యులు

రాకాశితండాలో వస్తువులు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 20: మున్నేటి ఉధృతి తగ్గి దాదాపు 20 రోజులు కావస్తున్నా దాని వరదకు సర్వం కోల్పోయి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న బాధితులకు పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, పలువురు దాతలు ఆపన్నహస్తం అందిస్తూనే ఉన్నారు. మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం కూడా నిత్యావసర వస్తువుల పంపిణీలు కొనసాగాయి. కొందరు నిత్యావసర సరుకులను, మరికొందరు బియ్యాన్ని, ఇంకొందరు నగదును అందజేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఏదులాపురం శ్రీరాంనగర్‌లో పీఎస్ఆర్ ట్రస్టు బాధ్యులు నిత్యావసర సరుకుల కిట్లతోపాటు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని కూడా అందజేశారు. రాజీవ్ గృహకల్పలోని 264 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2,900 విలువైన సరుకుల కిట్లను గూంజ్ సంస్థ బాధ్యులు పంపిణీ చేశారు. అలాగే, తమ కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా కల్లూరుకు చెందిన లంకా అప్పలనాయుడు, సత్యావతి దంపతులు సమకూర్చిన నిత్యావసర సరుకుల కిట్లను జలగంనగర్‌లో ఎస్‌హెచ్‌వో ముష్కారాజ్ పంపిణీ చేశారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 20: మండలంలోని రాకాశితండా వరద బాధితులకు రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ బాధ్యులు శుక్రవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. తహసీల్దార్ రామకృష్ణ, రోటరీ క్లబ్ చైర్మన్ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గండిపూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించిన ఏసీపీ

పాత కాలువకు పడిన గండిపూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

కూసుమంచి, సెప్టెంబర్ 20: పాలేరు పాత కాలువకు మల్లాయిగూడెం సమీపంలో పడిన గండిని ఇరిగేషన్ అధికారులు పూడ్చివేసి గురువారం నీటిని విడుదల చేశారు. కాగా, ఈ ప్రాంతాన్ని ఖమ్మం ఏసీపీ తిరుపతిరెడ్డి శుక్రవారం పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాలువకు ఈ నెల 1న వచ్చిన వరదల కారణంగా గండి పడిన విషయం విదితమే. కాగా, నీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇప్పటికే చిన్న కాలువకు అధికారులు నీటిని వదిలారు. పెద్ద కాలువకు కూడా రేపో మాపో నీటిని వదలనున్నారు. గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు, ఇరిగేషన్ అధికారులు, మంత్రి క్యాంపు కార్యాలయ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 20 : ఖమ్మం నగరంలోని బాలికల జూనియర్ కళాశాలలో సుమారు 600 మంది విద్యార్థినులకు వైబ్రెంట్ కలాం స్వచ్ఛంద సంస్థ రూ.లక్ష విలువ చేసే 2వేల నోట్‌బుక్స్‌ను వితరణ చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులకు సాయం చేయడం పట్ల సంస్థ బాధ్యులు విజయ్ కలాంను అభినందించారు.

నయాబజార్ పాఠశాలలో..

ఖమ్మం వ్యవసాయం/ ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 20 : నగరంలోని నయబజార్ పాఠశాలలో విద్యార్థులకు మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ శుక్రవారం నోట్ పుస్తకాలు అందజేశారు. కళాశాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదలకు దెబ్బతిన్న పాఠశాలను అన్నివిధాలా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధారాణి, ప్రిన్సిపాల్ కే రామారావు, కార్పొరేటర్ రఫిదాముస్తఫా, నాళం సతీష్, పరశురాం పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బోనకల్లు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రైల్వే అధికారులు

బోనకల్లు/ మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20: గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రైల్వే రక్షణ దళం ఖమ్మం ఇన్‌స్పెక్టర్ సురేశ్‌బాబు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఖమ్మంతోపాటు పరిసర రైల్వే స్టేషన్లలో శుక్రవారం పర్యటించిన ఆయన.. బోనకల్లు గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తాచెదారాలను రైల్వే లైన్ పరిసరాల్లో వేయవద్దని సూచించారు. అలా వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్ఐలు మొదింసా, ప్రసన్నకుమార్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

పంట పెట్టుబడి రుణాలు చెల్లించాలి

రఘునాథపాలెం, సెప్టెంబర్ 20 : పంట పెట్టుబడి సాయంగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తప్పకుండా చెల్లించాలని ఏపీజీవీబీ బ్యాంక్ అధికారులు రైతులకు సూచించారు. శుక్రవారం పండితాపురానికి చెందిన బ్యాంక్ అధికారులు కోటపాడులోని రైతులతో సమావేశమై మొండి బకాయిదారుల పేర్లను చదివి వినిపించారు. తీసుకున్న రుణం ఏడాదిలోపు చెల్లించి మళ్లీ తిరిగి లోన్ పొందవచ్చునని సూచించారు. వారికి తక్కువ వడ్డీతో పాటు సబ్సిడీ సైతం లభిస్తుందని వివరించారు. మాజీ సర్పంచ్ బాతుల రమణసుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ నవీన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష శిక్షణ ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 20 : ఇంగ్లీష్‌పై విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, వారి ఆలోచనలను ఇంగ్లీష్‌లోనే పంచుకునే విధంగా పలు పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమం మొదలైంది. జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి 6, 7 తరగతుల విద్యార్థులకు ఆంగ్లంపై నిత్యం అర్ధగంటపాటు అనుభవం ఉన్న మెంటర్స్‌తో శిక్షణ అందించేలా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొణిజర్లలో హైస్కూలో ఏఎంవో రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బీవోబీ బ్రాంచ్ ప్రారంభం

రఘునాథపాలెం, సెప్టెంబర్ 20 : ఖమ్మం నగరం బల్లేపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన బ్రాంచ్‌ను ఈ నెల 21వ తేదీ శనివారం ప్రారంభించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ బొల్లం మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపురం మినీ ట్యాంక్‌బండ్ ఎదురుగా బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రారంభానికి హైదరాబాద్ జోనల్ హెడ్ రితేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను అక్టోబర్ 15వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా ఈపాస్ వెబ్‌సైట్‌లో సమర్పించాలని సూచించారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో జేఏసీ రాష్ట్ర నాయకుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మట్టె గురుమూర్తి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఎల్లయ్య, కొండ్రు ఉపేందర్, మనోజ్‌కుమార్, భాస్కర్, వంశీ, ప్రవీణ్, సాగర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20 : మున్నేరు వరద ముంపు బాధితుల సహాయార్థం సాంస్కృతిక సారథి, జానపద కళాకారులు తమవంతుగా నగరంలో మూడురోజులుగా విరాళాలు సేకరించగా వచ్చిన రూ.50 వేలను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు అందించారు. కళాకారులు పిడియాల రాము, పెద్దపాక విజయ్, గుడిపల్లి పుల్లారావు, ఏలూరి మధు, చల్లా రంగ, మొగిలి వెంకటేశ్వర్లు, వరియోగుల స్వాతి, పాగి వెంకన్న, మిమిక్రీ సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

బోనకల్లు, సెప్టెంబర్ 20: ఓటర్ల జాబితాలో సవరణలు, చేర్పులు మార్పులపై మండలంలోని కలకోట గ్రామంలో బీఎల్‌వోలు చేస్తున్న ఇంటింటి సర్వేను హైదరాబాద్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి, హెచ్2హెచ్ ధృవీకరణ జిల్లా ప్రత్యేకాధికారి ప్రసూనాంబ శుక్రవారం పరిశీలించారు. కలకోటలోని 140, 141 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ సర్వేను పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఖమ్మం ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ పున్నం చందర్, గిర్దావర్ లక్ష్మణ్, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ యాకుబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీలు

మధిర/ బోనకల్లు/ తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 20: జిల్లాలోని మధిర, బోనకల్లు, తిరుమలాయపాలెం మండలాల్లో మండల స్థాయి క్రీడాపోటీలు జరుగుతున్నాయి. మధిర టీవీఎం పాఠశాలలో 2వ రోజు క్రీడలను మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, పట్టణ ఎస్సై సంధ్య ప్రారంభించారు. బోనకల్లు మండలం చిరునోముల ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడల్లో బోనకల్లు మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థులు విజేతలుగా నిలిచారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి విద్యార్థుల ఆటలపోటీలను స్థానిక ఎస్సై కూచిపూడి జగదీశ్ ప్రారంభించారు. ఎంపీడీవో శిలార్, ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరం

ముదిగొండ, సెప్టెంబర్ 20: మండలంలోని న్యూలక్ష్మీపురం గ్రామ ఓటరు జాబితాపై బీఎస్పీ నాయకులు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ముదిగొండలో తహసీల్దార్ సనీతా ఎలిజెబెత్‌ను కలిసి అభ్యంతరాలను తెలిజేశారు. జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేయాలని కోరారు. పల్లెపొంగు విజయ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

మధిర, సెప్టెంబర్ 20: పీఆర్‌టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్ నేతృత్వంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన పీఆర్‌టీయూ కార్యవర్గ బాధ్యులు శుక్రవారం మండల అధికారులను కలిశారు. తహసీల్దార్ రాంబాబు, ఎస్‌టీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో ప్రభాకర్‌లను కలిసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. సంఘం బాధ్యులు బ్రహ్మారెడ్డి, రవికుమార్, పిల్లి నరసింహారావు, జమీర్ పాల్గొన్నారు.

'22, 23 తేదీల్లో రాష్ట్ర మహాసభలు'

మధిర, సెప్టెంబ ర్20: ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే తెలంగాణ ఆటో, క్యాబ్ ప్రైవేటు మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మధిర ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బెజవాడ రవి కోరారు. మధిర ఆర్‌వీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడి మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 20: దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీడీవో శిలార్ అన్నారు. ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెంలో శుక్రవారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల స్వయం ఉపాధి గురించి వివరించారు. ఏపీఎం మంగమ్మ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మంచి రోజులంటే ఇవేనా?: బీఆర్ఎస్

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 20: వ్యవసాయ పనులు మన్పించి రైతులను రోడ్లపైకి తీసుకొచ్చిన చరిత్ర సీఎం రేవంత్‌రెడ్డిదేననిని బీఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులకు మంచి రోజులు అంటే ఇవేనా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడూ రైతులకు ఇలాంటి కష్టాలు రాలేదని గుర్తుచేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కారేపల్లి, సెప్టెంబర్ 20: మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఇటీవల బదిలీపై, ప్రమోషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం ధర్మ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. బదిలీ అయిన హెచ్ఎం నామానాయక్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం తనబాధ్యతగా ఎంతో నిబద్ధతో విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీ రాందాస్, జీ శ్రీనివాస్, జే నాగేశ్వరరావు, జే రామారావు, ఎం బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలాసి భాగ్యమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సీపీఎం బేతుపల్లి శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. అనంతరం బేతుపల్లి శాఖ మహాసభలో నూతన కార్యదర్శిగా కాకాని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సునందన్‌రావు, కొండ, వెంకటలక్ష్మి, నాగరాజు, రమాదేవి, శ్రీను పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాటాలు

పెనుబల్లి, సెప్టెంబర్ 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేది ఐద్వా ఒక్కటేనని మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని వీఎం బంజర చలమాల సూర్యనారాయణభవన్‌లో జరిగిన మహిళా సంఘం మండల మహాసభలో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలపై అనేక రకాలుగా దాడులు, వివక్షత గురవుతున్నారన్నారు. మహిళా హక్కులను కాలరాసి కేంద్ర ప్రభుత్వ విధానాలు మోదీని గద్దెదించేందుకు మహిళలు ఐక్య పోరాటాలు నిర్వహించాలన్నారు.

మండాలపాడులో వనమహోత్సవం

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, సెప్టెంబర్ 20: మండలంలోని మండాలపాడు విశిష్ట వెంచర్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం వాతావరణంలో కలిగే మార్పుల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కల్లూరు, పెనుబల్లి ఏఎంసీ చైర్మన్‌లు భాగం నీరజప్రభాకర్‌చౌదరి, ఎంపీడీవో, ఎఫ్ఆర్‌వో, అటవీశాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రతినెల వైద్య పరీక్షలు చేయాలి

కొణిజర్ల, సెప్టెంబర్ 20: గర్భిణులకు ప్రతినెల వైద్య పరీక్షలు చేయాలి, మంచి ఆహారం తీసుకోవాలని సీడీపీవో హెచ్ కమలప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని తనికెళ్ల రైతువేదికలో పోషణమాసాన్ని నిర్వహించారు. ఏసీడీపీవో ఎం ఉషారాణి మాట్లాడుతూ కిశోర బాలికలు ఐరన్ రిచ్ ఫుడ్ తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యతహసీల్దార్ ఎండీ తఫజ్జుల్‌హుస్సేన్, మండల సూపర్‌వైజర్లు డీ రాజ్యలక్ష్మి, ఎన్ అరుణ, కే జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కొణిజర్ల, సెప్టెంబర్ 20: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆటోసియస్ పాఠశాలలో కే మార్క్ అధ్యక్షతన నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ శుక్రవారం ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా అండర్-17 వాలీబాల్ బాలికలు విజేతగా జడ్పీహెచ్ఎస్ తనికెళ్ల రన్నర్‌గా జడ్పీహెచ్ఎస్ కొణిజర్ల నిలిచారు. అండర్-14 వాలీబాల్‌లో విజేతగా తనికెళ్ల పాఠశాల నిలవగా, పెద్దమునగాల రన్నర్‌గా నిలిచారు. అండర్-14 ఖోఖోలో విజేతగా తుమ్మలపల్లి, రన్నరప్‌గా సింగరాయపాలెం నిలిచింది. కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసన్, తనికెళ్ల కాంప్లెక్స్, సింగరాయపాలెం, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎంలు అబ్రహం, లక్ష్మీనారాయణ, డీ శ్రీనివాస్, సెంట్‌అలోసియేస్ కరస్పాండెంట్ వజ్ర కుమారి, ప్రిన్సిపాల్ జోలి పాల్గొన్నారు.

వేమన పుస్తకాలు పంపిణీ

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 20: ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ, గార్లపాటి పాపాచలం, బొల్లెపల్లి సత్యనారాయణరాజు స్మారక ట్రస్టు ప్రచురించిన శతక పుస్తకాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శుక్రవారం ఆవిష్కరించారు. రెండు సంస్థలు ప్రచురించిన రెండు వేల పుస్తకాలను మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలతో పాటు, ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, బీ.మధుసూదనరాజు, ఆశాడైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి, సెప్టెంబర్ 20: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సత్తుపల్లిలోని ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ 10 నెలలుగా రావాల్సిన కోడిగుడ్లు, అల్పాహారం బిల్లులు, వేతనం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దసరా సెలవుల లోపు పెండింగ్ మెస్‌చార్జీలు, పెండింగ్‌వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి సీపీఐ మండల కార్యదర్శి తడికమల్ల యేబు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తెల్లగారపు రామారావు, కర్నాటి బసవయ్య, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంటా ఎంక బంకమ్మ, మహాదేవ లక్ష్మి, పొదిలి జయమ్మ, శ్రీలక్ష్మి, శివకుమారి, సక్కుబాయి సావిత్రి, కృష్ణవేణి, కమల, అనసూయ, వెంకమ్మ, విజయలక్ష్మి, కే లక్ష్మి, జుబేద పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

కారేపల్లి, సెప్టెంబర్ 20 : కోతులు రాకుండా అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తూరుతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ధరావత్ హతీరాం(42) గ్రామ సమీపంలోని తన పత్తి చేను వద్ద కోతులను తరిమే క్రమంలో పక్క రైతు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య నాగమణి చేను వద్దకు వెళ్లి చూడగా హతీరాం కిందపడిపోయి ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాజారాం సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడు హతీరాంకు కూతురు దీక్ష ఉంది.

బాకీ చెల్లించాలన్నందుకు దాడి..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

కూసుమంచి, సెప్టెంబర్ 20 : తన కిరాణా దుకాణంలో అరువుగా తీసుకున్న బాకీని తిరిగి చెల్లించాలని అడిగిన ఓ మహిళపై ఓ వ్యక్తి దాడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన సదరు దుకాణ నిర్వాహకురాలైన ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన బోడా శాంతమ్మ (55) అనే మహిళ చిన్న కిరాణా కొట్టు పెట్టుకొని జీవిస్తోంది. అదే తండాకు చెందిన జర్పుల శివ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రిత